క్లుప్తంగా

గాయత్రీదేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

రాజాం సిటీ: పట్టణంలోని గాయత్రికాలనీలో గాయత్రీ దేవి ఆలయంలో అర్చకులు వాస జగదీశ్వరరావుశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢం సందర్భంగా అమ్మవారిని కూర గాయలతో అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

రైల్వే పనులతో ఇబ్బందులు



ఎంపీ కలిశెట్టికి వినతిపత్రం అందజేస్తున్న మల్లంపేట గ్రామస్తులు

బొబ్బిలి: రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మల్లంపేట గ్రామస్తులు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వద్ద మొరపెట్టుకున్నా రు. రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను ఎంపీ శనివారం పరిశీలించారు. గ్రామస్తులు ఆయన్ని కలిసి సమస్యలను వివరించారు. రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలో వర్షపు నీరు నిలిచిపోతోందని, ఆ నీటిలో పాములు, తేళ్ల లాంటి విషపురుగులు ఉంటున్నాయని వివరించా రు. ఆనీటిలో నుంచి రాకపోకలు సాగించేందుకు భయంగా ఉందని, వర్షపు నీటిని తొలగించా ల్సిన రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదని,సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఎంపీ వెంట ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, తదితరులున్నారు.


విద్యాసామర్థ్యాల పెంపే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంఈఓ తిరుమలప్రసాద్

రామభద్రపురం: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంచడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు లెసన్ ప్లాన్ తయారు చేసుకోవా లని ఎంఈఓ తిరుమలప్రసాద్ అన్నారు. మండలంలోని రామభద్రపురం,ఆరికతోట, బూసాయవలస, కొట్టక్కి ఉన్నత పాఠశాలల క్లస్టర్ పరిధిలోని పాఠశాలల హెచ్ఎంలతో పాటు అందరి ఉపాధ్యాయులతో రామభద్రపురం హైస్కూల్‌లో శనివారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ లెసన్ ప్లాన్ ప్రకారం పాఠ్యాం శాలు బోధించాలని చెప్పారు. బడిబయట ఉన్న బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంలకు సూచించారు. రామభద్రపురం హైస్కూల్ హెచ్ఎం వి.గోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులపై సమీక్ష



ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: మున్సిపాలిటీలో 15వ ఆర్థిక సంఘం,ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజూ తాగునీటి క్లోరినేషన్‌ను పరిశీలించాలని, వర్షాకాలంలో నీరు కలుషితం కాకుండా చూడాలని సూచించారు. సమావేశంలో డీఈ కిరణ్‌కుమార్,ఏఈలు పాల్గొన్నారు.

పటిష్టంగా భూముల రీసర్వే



రైతుల సమక్షంలో ఆర్ఓఆర్‌ను ప్రదర్శిస్తున్న తహసీల్దార్ రమణారావు

వంగర: భూముల రీసర్వేను పటిష్టంగా చేపడుతున్నామని తహసీల్దార్ హరి రమణారావు తెలిపారు. మండలంలోని మరువాడలో ఇటీవల భూరీసర్వే పూర్తి కావడంతో శనివారం ఆగ్రామంలో నోటిఫికేషన్-13తోపాటు ఆర్ఓఆర్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా భూరికార్డులను సిద్ధం చేశామని చెప్పారు. రీసర్వే డీటీ రుంకాన శ్రీను, వీఆర్ఓ ఈశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలే శ్రీరామరక్ష

- చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి
- సకాలంలో టీకాలు వేయించే బాధ్యత తల్లిదండ్రులదే
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా నిల్వలు
- ప్రతీ బుధ,శనివారాల్లో ఉచితంగా టీకాలు



రామభద్రపురం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

రామభద్రపురం: గర్భిణులతో పాటు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు.గర్భిణుల నుంచి అప్పుడే పుట్టిన చిన్నారుల వరకు ప్రభుత్వం సూచించిన సమయాల్లో టీకాలు వేయిస్తే వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యకరమైన జీవితం గడపొచ్చు. ప్రధానంగా చిన్నారులు భవిష్యత్‌లో కొన్నిరకాల వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు టీకాలు రక్షణగా, శ్రీరామ రక్షగా నిలుస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో పూర్వం టీకాలు అందుబాటులో లేక, ఉన్నా సరైన అవగాహన లేకపోవడం వంటి కారణాలతో గర్భిణులు టీకాలు వేయించుకునే వారు కాదు. దీంతో మాతా శిశుమరణాలు సంభవించేవి.అయితే గత అయిదారేళ్లుగా అలాంటి ఘటనలు తగ్గుముఖం పట్టాయి. పుట్టిన ప్రతీ బిడ్డ ఆరోగ్యంగా ఎదిగేందుకు, వ్యాధి నిరోధక టీకాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధినిరోధక టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రతి బుధ,శనివారాల్లో..

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి బుధ,శనివారాల్లో అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, సచివాలయాలు,అంగన్‌వాడీ కేంద్రాలు,పంచాయతీ కార్యాలయాల్లో గర్భిణులు,చిన్నారులకు వైద్యసిబ్బంది ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు.

వ్యాక్సిన్లు వేసేది ఇలా..

- గర్భిణిగా నిర్ధారణ అయిన వెంటనే 3 నెలలు నిండిన తర్వాత ఒక టీటీ ఇంజెక్షన్, అనంతరం ఇంకో నెల రోజుల వ్యవధిలోనే మరో టీటీ ఇంజెక్షన్ వేయిలి.వీటితో పాటు ఐరన్ పోలిక్,కాల్షియం టాబ్లెట్లు ఇస్తారు.
- అప్పుడు పుట్టిన శిశువుకు 24 గంటల వ్యవధిలో క్షయవ్యాధి నుంచి రక్షణకు బీసీసీ,పోలియో నివారణకు ఓపీవీ డోసు,కామెర్ల వ్యాధి రాకుండా అరికట్టేందుకు హెపటైటీస్ టీకా వేయించాలి.
- 45 రోజులు వ్యవధిలో పోలియో నివారణకు ఓపీవీ-1, ఓపీవీ-2, ఓపీవీ-3, ఐపీవీ వేయించాలి.
- 75 రోజుల వ్యవధిలో పోలియో చుక్కలు,పెంటా వాలెంట్ వేయించాలి.వీటి వల్ల చిన్నారులను కోరింత దగ్గు,కంఠ సర్పి, ధనుర్వాతం,మెదడు వాపు, న్యుమోనియా వంటి వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు.
- 105 రోజుల వ్యవధిలో తీవ్ర నీళ్ల విరోచనాలు,వాంతులు,జ్వరం,కడుపునొప్పి,మూత్ర విసర్జన,బరువు తగ్గడం వంటి సమస్యల నివారణకు ఆర్‌వీవీ-1,2,3 టీకాలు వేయించాల్సి ఉంటుంది.
- తొమ్మిది నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు,రుబెల్లా వ్యాధుల నివారణకు ఎంఆర్-1, మీజిల్స్,కంటి,చర్మ వ్యాధులు రాకుండా విటమిన్-ఏ చుక్కలు వేయించాలి.మెదడువాపు నివారణకు జేఈ-1,దగ్గు,జ్వరం,శ్వాసలో ఇబ్బందుల నివారణకు ఎఫ్ఐవీవీ-3,తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వయసు వరకు ప్రతీ ఆరు నెలలకోసారి విటమిన్-ఏ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు ఇప్పించాలి.
- 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోసు డీపీటీ మీజిల్స్, విటమిన్-ఏ ఓపీ వేయించాలి.
- అయిదేళ్లు పూర్తయిన తర్వాత కంఠ సర్పి,కోరింత దగ్గు,ధనుర్వాతం నివారణకు డీపీటీ-2 డోసు వేయించాలి.10,16 సంవత్సరాలు పూర్తయితే టీటీ వేయించాలి.

టీకాలు తప్పనిసరి..



చిన్నారులు ఏ వ్యాధుల బారినపడకుండా ఎదిగితేనే ఆరోగ్యకర సమాజం తయారవుతుంది.గర్భిణులు,చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలి.వీటి వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు.గ్రామీణ ప్రాంత ప్రజలకు టీకాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ దిలీప్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి, రామభద్రపురం

అందుబాటులో 12 రకాల వ్యాక్సిన్లు



పుట్టిన నాటి నుంచి 16 ఏళ్ల వయసు పిల్లలు ఆరోగ్యవంతంగా ఎదిగేందుకు అవసరమైన 12 రకాల వ్యాక్సిన్లు వేస్తున్నాం. ప్రతీ బుధ,శనివారాల్లో వైద్య సిబ్బంది ఉచితంగా టీకాలు వేస్తున్నారు.తల్లిదండ్రులు బాధ్యతగా చిన్నారులను తీసుకెళ్లి క్రమం తప్పకుండా టీకా వేయించాలి.

– జి.లక్ష్మి,వైద్యాధికారి, పీహెచ్‌సీ వైద్యాధికారి, రామభద్రపురం

చంద్రబాబు మోసాలను ఎండగడదాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

- వైఎస్సార్‌సీపీ తెర్లాం మండల విస్తృతస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: ఎన్నికల హామీలు అమలు చేయకుండా సీఎం చంద్రబాబునాయుడు ఏడాది కాలంలో చేసిన మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజల వద్ద ఎండగ డదామని మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పిలుపునిచ్చారు. 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' కార్యక్రమంపై మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆపార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా శంబంగి మాట్లాడుతూ మోసం చేయడం చంద్రబాబు నైజమని అన్నారు. ఎన్నికల్లో చంద్రబాబునాయుడు, కూటమి నాయకు లు సూపర్ సిక్స్ పథకాలతో పా టు వందల హామీలు ఇచ్చారని, గద్దెనెక్కిన తర్వాత వాటిని తుంగలో తొక్కారని అన్నారు. హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు.వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతి నిధులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వారికి వివరించాలని కోరారు. సీఎం చంద్రబాబు ప్రజా సంక్షేమాన్ని, శాంతిభద్రతలను గాలికి వదిలేసి రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడుపుతున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో అ న్ని వర్గాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పార్టీశ్రేణులకు శంబంగి దిశా నిర్దేశం చేశారు. ఎంపీపీ, జెడ్పీటీసీల ప్రతినిధులు నర్సుపల్లి బాబ్జీరావు, గర్బాపు రామారావు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ప్రతినిధి అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ కిసాన్ మోర్చ జిల్లా నాయకుడు మర్రాపు జగన్నాథం, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం అవసరం

బొబ్బిలిరూరల్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అంతా అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల,వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అదనపు డీఎంహెచ్ఓ రాణి ప్రజలకు సూచించారు. పిరిడి పీహెచ్‌సీ పరిధిలోని ఎరకందొరవలస, కొయ్యికొండవలస గిరిజన గ్రామాల్లో శనివారం ఆమె పర్య టించారు. వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కల్పించారు. రక్తహీనత,బాల్యవివాహాలవల్ల కలిగే అనర్థాలను వివరించారు. వైద్యులు అర్చన, రఘువంశీ తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ రాణి

హాస్టల్ విద్యార్థులకు బెడ్స్

బొబ్బిలి: అంతర్జాతీయ రోటరీ సంస్థ, బొబ్బిలి రోటరీక్లబ్ సామాజిక సేవావిభాగంలో భాగంగా వసతి గృహాల్లోని బాల,బాలికలకు పంపిణీ చేసేందుకు బెడ్స్ సిద్ధం చేశామని రోటరీక్లబ్ జిల్లా చైర్మన్ జె.సి.రాజు,డైరెక్టర్ సింద్రి శ్రీనివాస్ తెలిపారు.శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ లక్షా డబ్బైవేల రూపాయలతో 150 పరుపులను కొనుగోలు చేశామని, వీటిని బొబ్బిలి కళాశాల బాలికల వసతి గృహం, రామబద్రపురం మండలం నేరేళ్లవలస గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు త్వరలో అందజేస్తామని తెలిపారు.



విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్న పరుపులు

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం

రాజాం: అంతా చేయి చేయి కలిపి ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దామని రాజాం జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.ఎల్.వి.ఆర్.ఎస్.వి.ప్రసాద్ అన్నారు. 'స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జీఎంఆర్ ఐటీ నుంచి డోలపేట జంక్షన్ వరకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఐటీ విద్యార్థులతో కలిసి ప్లాస్టిక్ నిషేధంపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. ప్రొఫెసర్ రాంబాబు, పీడీ అరుణకుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



జీఎంఆర్ ఐటీ విద్యార్థుల మానవహారం

స్మార్ట్‌మీటర్లు,సర్దుబాటు చార్జీలు రద్దుచేయాలి

బొబ్బిలి: కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఉల్లఘించి ఇంటింటా స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నాయని ,నాడు స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించిన లోకేష్ నేడు వాటి ఏర్పాటుకు సిద్ధపడుతున్నారని, మరో పోరాటం తప్పదని రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రభుత్వాన్ని ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించాయి. స్మార్ట్ మీటర్లు,సర్దుబాటు చార్జీలకు వ్యతిరేకంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శంకరరావు అధ్యక్షతన ప్రజాసంఘాల నాయకులతో స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉత్తరాది రాష్ట్రాలన్నీ వ్యతిరేకిస్తుండగా దక్షిణాదిలో కేవలం మన రాష్ట్రంలోనే స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేసేందుకు,అదానీ గ్రూపునకు లాభం చేకూర్చడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. స్మార్ట్‌మీటర్ల వల్ల విద్యుత్ బిల్లులు భారీగా చెల్లించాల్సి ఉంటుందని, కోట్లాదిరూపాయల భారాన్ని ప్రజల నెత్తిన మోపేందుకు ప్రభుత్వం సిద్ధపడిందన్నారు.ఇప్పటికే సర్దుబాటు చార్జీలతో వినియోగదారులను విద్యుత్ బిల్లులతో బాదేస్తున్నారని,సామాన్యులు బిల్లులు చెల్లించలేని పరిస్థితిని కల్పిస్తున్నారని విమర్శించారు.స్మార్ట్‌మీటర్లు,సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29నుంచి ఆగస్టు 4వరకు ఇంటింటా ప్రచారం చేసి సంతకాలను సేకరిస్తామని, 5న ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని తెలిపారు.కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఎం.గోపాలం, సీపీఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు,రైతుసంఘం జిల్లా నాయకులు సింగిరెడ్డి గోపాలం, రైతు సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, పుణ్యవతి,తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కూటమి మోసాలను ప్రతీ ఇంటికి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎంపీ బెల్లాన, డాక్టర్ తలే రాజేష్, తదితరులు

రాజాం: కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రతీ ఇంటికి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్య క్రమం నిర్వహణపై రాజాం పట్టణం లో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు ఇంటి వద్ద పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించా రు. పట్టణంలో 24 వార్డుల్లోనూ 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమం అమలుచేసేలా షెడ్యూల్ నిర్ణయిం చారు. ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరిట టీడీపీ ఓ కార్యక్రమం నిర్వహి స్తోందని, ఆ పార్టీ నాయకులు ప్రజల వద్దకు వెళ్లేందుకు భయపడుతూ రాత్రి వేళల్లో తూతూ మంత్రంగా ఆ కార్యక్రమాన్ని కానిచ్చేస్తున్నారని అన్నారు. అటువంటి భయం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు లేదని, 2019-24 మధ్య కాలంలో జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ లన్నీ నెరవేర్చారని, వాటిని ప్రజలకు గుర్తు చేయాలని సూచించారు. అలాగే చంద్రబాబు ఇచ్చిన హామీలు, వాటిని అమలు చేయకుండా వంచించిన విధానాన్ని ప్రతి గడపకూ తెలియజేయాలని చెప్పారు. పవన్ కల్యాణ్ వికృత చేష్టలను కూడా ప్రజలకు తెలియజేయడంతో పాటు ప్రజల పక్షాన పోరాడాల్సి ఉందని వెల్లడించారు.

ప్రణాళికతో ముందుకు..

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఎప్పుడూ ప్రజల పక్షమేనని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. కూటమి సూపర్ సిక్స్ హామీలన్నీ మోసపూరితమైనవని తెలిపారు. ప్రజలు అంతా కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్నారని, మనం గ్రామాల్లోకి వెళ్లి ప్రతీ ఇంటి వద్ద కూటమి మోసాలు వెల్లడించడంతో పాటు చంద్రబాబు ప్రజలను ఎలా మోసం చేస్తున్నారో వివరించాలని అన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ప్రశ్నిస్తే కేసులు పెడతారా..?

వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మోసాలు అధికమయ్యాయని అన్నారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధిని పక్కన పెట్టి ప్రతిపక్ష పార్టీపై కక్ష సాధింపునకు దిగుతున్నారని దుయ్యబట్టారు. కూటమి అరాచకాలను ఎవరినైనా ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. వీటన్నింటికి కూటమి నాయ కులు తగిన మూల్యం చెల్లించుకుంటారని, సామాన్యప్రజలను, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టే ఏ ఒక్కరినీ విడిచిపెట్టే ప్రసక్తేలేదని అన్నారు. అనంతరం ఆదినారాయణ కాలనీలో ఇంటింటికి వెళ్లి 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'కరపత్రాలు పంచిపెట్టారు.మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వైఎస్సార్‌సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, పార్టీ నాయకులు పాలవలస గోపి, పాలవలస శ్యామ్, దూబ గోపాలం, వంజరాపు విజయ్‌కుమార్, ఆసపు సూర్యం, డాక్టర్ నరేంద్ర, శాసపు వేణుగోపాలనాయుడు, కెంబూరు నారాయణరావు, ముద్దన సత్యారావు, సలాది జగదీష్, కిల్లారి శ్రీనివాసరావు, సింబాల రాము, దొంతంశెట్టి శ్రీనివాసరావు, కాలెపు శేఖర్, వెంపటాపు లక్ష్మణరావు, ఆర్నేపల్లి వెంకటనాయుడు, గోకవలస బాబూరావు, చప్పటి పెంటయ్య, పిట్టా జగదీష్, సత్యం, రెడ్డి రమేష్, అల్లెన జయలక్ష్మి, కోల రమ్య, సుశీల పాల్గొన్నారు.

చదరంగం బోర్డుల పంపిణీ

బొబ్బిలి: అంతర్జాతీయ చదరంగం దినోత్సవం సందర్భంగా ఏపీ చదరంగం అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చదరంగం బోర్డులు,పుస్తకాలు,పెన్నులు పంపిణీ చేశారు. లచ్చయ్యపేటవద్ద ఉన్న స్వామిదయానంద సరస్వతి సేవా ఆశ్రమంలో శనివారం జరిగిన ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన,గెంబలి శ్రీనివాసరావు,ఆ సంస్థ ప్రతినిధి మూడడ్ల గణేష్‌నాయుడు 10 చదరంగం బోర్డులను విద్యార్థులకు అందజేశారు.

ప్రభుత్వ భూమికి హద్దుల నిర్ధారణ

సాక్షి ఎఫెక్ట్

బాడంగి: మండలంలోని కోడూరు గ్రామ రెవెన్యూ పరిధి బీసీ కాలనీలో ఉన్న ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను రెవెన్యూ సిబ్బంది గుర్తించి, హద్దులు నిర్ధారించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణపై 'దర్జాగా కబ్జా' శీర్షికతో సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ స్పందించారు. సంబంధిత స్థలాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ సిబ్బందిని తహసీల్దార్ ఆదేశించారు. డిప్యూటీ సర్వేయర్, ఎంఆర్ఐ జగదాంబ, వీ ఆర్ఓ లు ఆ స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలను గుర్తించి, హద్దులు నిర్ధారించారు. స్థలాన్ని ఖాళీ చేయాలని కబ్జాదారుడిని ఆదేశించారు.కబ్జాదారుడు టీడీపీకి చెందిన వాడు కావడంతో అధికారులు మొక్కుబడితంతుగా చర్యలు చేపడుతున్నట్టు ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు.రికార్డుల్లో గోర్జి వాగుగా చూపెడుతున్నప్పటికీ ఆక్రమణదారుడితో ఎందుకు ఖాళీచేయించడం లేదని విమర్శిస్తున్నారు.



ప్రభుత్వ స్థలానికి హద్దులు నిర్ధారిస్తున్న రెవెన్యూ అధికారులు

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

- మాజీ ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: ఎన్నికల హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబునాయుడు కాలయాపన చేస్తుండడంతో ఏడాదిలోనే టీడీపీ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' కార్యక్రమంపై మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యామలశివప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఆపార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.అతిథిగా హాజరైన శంబంగి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేసిన పథకాలన్నీ తాము అధికారంలోకి వస్తే కొనసాగిస్తామని, వాటికి తోడు సూపర్‌సిక్స్‌తో పాటు వందల హామీలను చంద్రబాబు ప్రజలకు ఇచ్చారని గుర్తు చేశారు.టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఒక్క హామీని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయారని ఆరోపించారు. పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.1.04 లక్షలు చొప్పున అయిదేళ్లలో రూ.5. 20 లక్షలు లబ్ధిచేకూరుస్తామని చెప్పారని, ఏడాది పాలనలో ఎన్ని కుటుం బాలకు ఎంత సాయం చేశారో చెప్పాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

ఐకమత్యంతో పని చేద్దాం..

మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పని చేస్తే రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో గెలుపు తథ్యమని శంబంగి అన్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో బాడంగి మండలానికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, గత 40 ఏళ్లలో ఎప్పుడూ టీడీపీకి తప్ప ఇతరపార్టీలకు ఇక్కడ పదవులు రాలేదని, ఒక్కవైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే జెడ్పీటీసీ, ఎంపీపీ పదవులు వచ్చాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువ చ్చిన సంస్కరణలు, ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా అమలు చేసిన పథకాలు, అవినీతి రహిత పాలన వల్ల ప్రజలు మళ్లీ ప్రజలు ఆయన నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. మనపై ఎలాంటి అవినీతి మరకలు లేవని, ఎమ్మెల్యే బేబీనాయనపై భూకబ్జాలు, ఇతర ఆరోపణలు వస్తున్నాయన్నారు. గతంలో బేబీనాయన రోడ్ల పరిస్థితిపై ఫూటకో వీడియో చూపేవారని, మరి ఇప్పుడు రోడ్ల పరిస్థితి ఎలాగుందో అందరికీ తెలిసిందేనన్నారు. బొబ్బిలి మున్సిపల్ మాజీ చైర్మన్ సావుమురళీకృష్ణ, మాజీ ఎంపీపీ దామోదరరావు, జెడ్పటీసీ పెద్దింటి రామారా వు,ఎంపీపీ బోగి గౌరి,మండల వైస్ ఎంపీపీ బి.రమేష్, ఎంపీపీ ప్రతినిధి తెంటు మధుసూదనరావు, సీనియర్ నాయకులు ముగడ వెంటకరమణ, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఆవు సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

ప్రణాళికా బద్ధంగా బోధించాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యాంశాలను ప్రణాళికా బద్ధంగా బోధించాలని ఎంఈఓలు ఎం.వి.ప్రసాదరావు, బి.ఎరకయ్య ఉపాధ్యాయులకు సూచించారు.స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను విద్యార్థులందరికీ పంపిణీ చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని అన్నారు.

ఉత్తమ ప్రమాణాలను అందిపుచ్చుకోవాలి

బొబ్బిలిరూరల్: పాఠ్యాంశాల బోధనలో అత్యున్నతమైన ప్రమాణాలను అందిపుచ్చుకుని, పాటించాలని ఎంఈఓ చల్లా లక్ష్మణరావు ఉపాధ్యాయులకు సూచించారు.మండలంలోని పెంట,అలజంగి ఉన్నత పాఠశాలల్లో శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులకు టీచర్స్ హ్యాండ్‌బుక్, బోధనాపద్ధతులు,హోమ్ వర్క్ విధానం, అభ్యాస సామర్థ్యాలల నిర్ధారణపై శిక్షణ ఇచ్చారు.



రేగిడి: మాట్లాడుతున్న ఎంఈఓ ప్రసాదరావు